

మారుతీనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్‌లు

నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ధ్యేయం

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

గోల్నాక, మే 9 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గం సమగ్రాభివృద్ధే ధ్యేయం అని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం ప్రజల మధ్య ఉంటూ పనిచేస్తున్నానన్నారు. నియోజకవర్గం అభివృద్ధి విషయంలో ఎలాంటి రాజకీయాలకు తావు ఇవ్వకుండా అందరినీ కలుపుకొని ముందుకు వెళ్తున్నానన్నారు. శుక్రవారం గోల్నాక డివిజన్ మారుతీనగర్‌లో రూ.38లక్షలతో నూతనంగా నిర్మించ చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం పనులకు స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం బస్తీలో విస్తృతంగా పాదయాత్ర చేసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బస్తీలో నెలకొన్న అన్ని సమస్యలను పరిష్కరించి బస్తీని అభివృద్ధి పథంలో ముందు భాగంలో నిలుపుతానని భరోసా ఇచ్చారు. కోట్లాది రూపాయలతో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీనాయకులు ఎ.సురేష్‌గౌడ్, కొమ్ము శ్రీనివాస్, వై.బుచ్చిరెడ్డి, సత్యనారాయణ, బస్తీ పెద్దలు, అధి కారులు పాల్గొన్నారు.

వివేకానందనగర్ బస్తీవాసులకు ఇళ్లు కేటాయించాలి

● కలెక్టర్‌కు బీజేపీ వినతి



కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతిపత్రం అందజేస్తున్న వినయ్‌కుమార్, బస్తీవాసులు

చిక్కడపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ స్వామివివేకానందనగర్ బస్తీవాసులకు వెంటనే ఇళ్లు కేటాయించాలని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్, బాధిత బస్తీవాసులు కోరారు. శుక్రవారం హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిసి వారు వినతిపత్రం అందజేశారు. స్వామి వివేకానందనగర్ బస్తీలో అర్ధశతాబ్దానికి పైగా ఉంటున్న 19 మంది నిరుపేద దళిత కుటుంబాలకు చెందిన ఇళ్లను ఏడాదిన్నర కిందట రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది కూల్చివేశారన్నారు. ఇంత వరకు వారికి గృహాల కేటాయింపు జరగలేదని వివరించారు. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డా. లక్ష్మణ్, ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి కూడా తీసుకెళ్లామని తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్.. బాధితులకు త్వరలోనే డబుల్‌బెడ్రూమ్ ఇళ్లు కేటాయించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో బస్తీవాసులు ఎంబీ కృష్ణ, జ్ఞానేశ్వర్, ఆనంద్‌రావు తదితరులున్నారు.

ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

● మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతిశ్రీకృష్ణ



ఫిర్యాదు చేసిన పత్రాలు చూపిస్తున్న డాక్టర్ కృష్ణ

నల్లకుంట, మే 9 (ఆంధ్రజ్యోతి) : అమాయకులకు మాయమాటలు చెప్పి మోసం చేసిన ఓ ఏసీపీ పై తగిన చర్యలు తీసుకోవాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతిశ్రీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బాధితుడు డాక్టర్ బి.కృష్ణతో కలిసి ఆయన మాట్లాడారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఊరకొండ మండలం రాచాలపల్లిలో సర్వేనంబర్ 113ఉ, 113అ, 113ఈ, 130అ లో గల 7 ఎకరాల 33 గుంగల భూమి బాధితుడు డాక్టర్ బి.కృష్ణకు పూర్వీకుల నుంచి వచ్చిందన్నారు. కుటుంబ అవసరాల నిమిత్తం దాన్ని విక్రయించేందుకు అతని సోదరుడైన పవన్‌ను సంప్రదించినట్లు తెలిపారు. దీంతో ఏసీపీ కిషన్‌గౌడ్ వద్దకు తీసుకెళ్లి పరిచయం చేసి భూమికి సంబంధించిన వివరాలను చెప్పాడన్నారు. దీంతో కిషన్‌గౌడ్ 7 ఎకరాల 33 గుంటల భూమిని వేరే వారికి రూ.6 కోట్లకుపైగా విక్రయించి మూడు సంవత్సరాలు పూర్తయినా నేటి వరకు డబ్బులు ఇవ్వకపోగా తీవ్ర భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. ఈ విషయమై ప్రస్తుత చేవెళ్ల ఏసీపీ కిషన్‌గౌడ్‌పై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని సీఎంను కోరారు.



ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నర్సింగ్‌రావు తదితరులు

దేశవ్యాప్తంగా కులగణన నిర్ణయం అభినందనీయం

బర్కత్‌పుర, మే 9 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా కులగణనకు కేంద్రం ఆమోదించడం అభినందనీయం అని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి అధికార ప్రతినిధి ముత్యాల నర్సింగ్‌రావు అన్నారు. ఇది దేశ చరిత్రలో నిలిచిపోతుందని, ఆ ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందన్నారు. శుక్రవారం బర్కత్‌పుర చౌరస్తా వద్ద మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చి ఆర్డినెన్స్ జారీ చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ దేశ ప్రజలకు సంతోషాన్ని కలిగించిందన్నారు. సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక మాట్లాడుతూ రాహుల్‌గాంధీ బీసీ డిక్లరేషన్‌ను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.శ్రీనివాస్, కె.సంపత్, కృష్ణ, శ్రీశైలం, వెంకటయ్య, ప్రశాంత్, సీ.హెచ్.రాములు, భరత్, నవీన్‌కుమార్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

'సోవియట్ యూనియన్ త్యాగాలు మరువలేం'

రాంనగర్, మే 9 (ఆంధ్రజ్యోతి) : ఫాసిజాన్ని ఓడించడం కోసం నాటి సోవియట్ యూనియన్ అనేక త్యాగాలు చేసి ప్రపంచాన్ని రక్షించిందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్.వీరయ్య పేర్కొన్నారు. శుక్రవారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో ఫాసిజంపై సోవియట్ యూనియన్ సాధించిన విజయాన్ని పురస్కరించుకుని 'సమకాలీన పరిస్థితులు - సవాళ్లపై సమావేశం జరిగింది. 2 కోట్ల మంది ప్రజలు బలిదానం చేశారని పేర్కొన్నారు. ఫాసిస్టు హిట్లర్ సైన్యంపై ఎర్రసైన్యం వీరోచిత పోరాటం చేసి హిట్లర్ సైన్యాన్ని జర్మనీ బెర్లిన్ వరకు తరిమికొట్టారని గుర్తుచేశారు.

సార్వత్రిక సమ్మెకు తరలిరండి

రాంనగర్, మే 9 (ఆంధ్రజ్యోతి) : మతవిద్వేషాలు రెచ్చగొడుతున్న మతోన్మాదుల దౌర్జన్యాలను యువతరం ప్రతిఘటించాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు పేర్కొన్నారు. ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో సామాజిక శక్తులు, కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.. శుక్రవారం చిక్కడపల్లిలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. నాగార్జున, కురుమయ్య, మాణిక్యం, మనోహర్, కుమార్,లలిత, సురేష్ పాల్గొన్నారు.

బడేసాబ్‌కు డాక్టరేట్ ప్రదానం

చిక్కడపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా చైతన్యసమితి అధ్యక్షుడు బడేసాబ్ గౌరవ డాక్టరేట్ పొందారు. జర్మనీ యూనివర్శిటీ వారు ఈ పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా త్యాగరాయగానసభలో తెలుగు భాషకు పట్టాభిషేకం సమావేశంలో తెలుగు భాష పరిరక్షణకు బడేసాబ్ చేస్తున్న కృషికి గుర్తింపుగా గౌరవ డాక్టరేట్ వచ్చినట్లు నిర్వాహకులు ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ ప్రొ. ఎటుకల పురుషోత్తం అభినందనలు తెలిపి ఆయన్ను అభినందించారు.



గంజాయి విక్రయదారుడిని విలేకరులకు చూపుతున్న ఎక్సైజ్ సీఐ రామకృష్ణ

వృత్తి ఆటోడ్రైవర్.. ప్రవృత్తి గంజాయి అమ్మకం

● వ్యక్తి అరెస్టు, 5.20 గ్రాముల సరుకు స్వాధీనం, ఆటో సీజ్

ముషీరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ముషీరాబాద్ ఎక్సైజ్ సీఐ రామకృష్ణ శుక్రవారం స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. లాలాపేట్ ప్రాంతానికి చెందిన నరేష్ (28) ఓ ఆటో డ్రైవర్. కొంత కాలంగా గుట్టు చప్పుడు కాకుండా గంజాయిని విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీసులు నరేష్‌ను పట్టుకున్నారు. అతని వద్ద 5.20 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆపై ఆటో సీజ్ చేశారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

సైన్యానికి సెల్యూట్

● ఎమ్మెల్యే ముఠాగోపాల్

● భోలక్‌పూర్‌లో బీఆర్‌ఎస్ నేతల భారీ ర్యాలీ



భోలక్‌పూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, వై.శ్రీనివాస్‌రావు తదితరులు

ముషీరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): సరిహద్దుల వద్ద పాకిస్తాన్ సైనికులు చేస్తున్న దాడులను దేశ సాయుధ బలగాలు తిప్పికొట్టి వారికి తగిన గుణపాఠం చెప్పారని ఎమ్మెల్యే ముఠా గోపాల్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో పాకిస్తాన్ ఉగ్రవాద స్థావరాలపై మన సైనికులు చేసిన ఎదురుదాడిని హర్షిస్తూ బిలాల్ మసీదు నుంచి ఇందిరానగర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఇందులో ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠాగోపాల్ తో పాటు బీఆర్‌ఎస్ నేతలు జాతీయ జెండాను చేబూని సైనికులకు మద్దతుగా నినాదాలు ఇచ్చారు. సైన్యం త్యాగాలను దేశ ప్రజలు ఎన్నటికీ మర్చిపోలేరన్నారు. ప్రజలంతా వారికి రుణపడి ఉంటారన్నారు. ఆంధ్రకు చెందిన మురళీ నాయక్ త్యాగాన్ని సైతం మర్చిపోలేమన్నారు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు. కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు ఏకతాటిపైకి వచ్చి సైన్యానికి అండగా నిలవాలని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహా, డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ రావు, రాష్ట్ర నాయకులు రహీం, షరీఫ్, డివిజన్ ఉపాధ్యక్షుడు శంకర్ గౌడ్, చాంద్‌పాషా, పార్టీ నాయకులు కె. మాధవ్, శ్యామ్‌సుందర్, మహేష్, కృష్ణ, ప్రవీణ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు బకాయిలను విడుదల చేయండి : ఆర్.కృష్ణయ్య

రాంనగర్, మే 9 (ఆంధ్రజ్యోతి) : డిగ్రీ బీసీ విద్యార్థుల ఫీజు బకాయిలు రూ.400 కోట్లు వెంటనే విడుదల చేయాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎంకు రాసిన లేఖ వివరాలు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీలలోని డిగ్రీ కాలేజీ విద్యార్థులకు ఫీజు బకాయిలు చెల్లించాలన్నారు. యాజమాన్యాలు డిగ్రీ పరీక్షలు నిర్వహించకపోవడం వల్ల విద్యార్థులు విద్యా సంవత్సరం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయమై బీసీ సంక్షేమ సంఘం అనేకసార్లు ధర్నాలు, ఆందోళనలు చేసినా స్పందనలేదన్నారు.



ముషీరాబాద్: నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్, కార్పొరేటర్లు

రోహింగ్యాలను వెనక్కి పంపాలి

● బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్

ముషీరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో అక్రమంగా నివసిస్తున్న రోహింగ్యాలను వెంటనే వారి సొంత ప్రాంతాలకు పంపించేయాలని బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్ కోరారు. నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌ను శుక్రవారం బీజేపీ కార్పొరేటర్లు, నాయకులతో కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు. పాకిస్తాన్ నుంచి వచ్చి మన దేశంలో నివాసం ఉంటున్న వారి వీసా గడువు ముగిసినప్పటికీ ఇక్కడే ఉంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సరళ, దీపిక, బీజేపీ అధికార ప్రతినిధి బొల్లంపల్లి రాంరెడ్డి, బీజేపీ జాతీయ ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు పూసరాజు, ముషీరాబాద్ బీజేపీ నియోజకవర్గం కన్వీనర్ రమేష్‌రాం, నాయకులు మేకల సారంగ పాని, జమాల్‌పురి నందు, నాగేశ్వర్‌రెడ్డి, శ్రీశైలం గౌడ్, శ్రీనివాస్ యాదవ్, హరి, శారద, మల్లేష్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్ : హైదరాబాద్‌లో అక్రమంగా నివసిస్తున్న రోహింగ్యాలు తమ వీసా సమయం ముగిసినా గానీ హైదరాబాద్‌లో నివసిస్తున్న వారిని వెంటనే గుర్తించి సొంత ప్రాంతాలకు పంపించాలని మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు జి.భరత్‌గౌడ్ నేతృత్వంలోని ఓ బృందం సభ్యులు కోరారు. శుక్రవారం నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌ను కలిసి వారు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు మేకల సారంగపాణి, మల్లంపేట రమేష్‌రామ్, కార్పొరేటర్లు కె.సరళ, కె.దీపిక, నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, శ్రీశైలంగౌడ్, రాంరెడ్డి, పూసరాజు, శ్రీనివాస్‌యాదవ్, రఘునాథ్, నందు, హరి, శారద, మల్లేష్, నరసింహ, రాజు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ వీహెచ్

బీసీ కులగణన దేశానికే ఆదర్శం

● మాజీ ఎంపీ వి.హనుమంతరావు ● 22న కొత్తకోటలో బీసీ చైతన్య సదస్సు

బర్కత్‌పుర, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన బీసీ కులగణన దేశానికే ఆదర్శంగా నిలిచిందని మాజీ ఎంపీ వి.హనుమంతరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా కులగణన చేపడతామని ప్రకటన చేసిందన్నారు. అందుకు కారణం ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీయేనని అన్నారు. శుక్రవారం కాచిగూడ అభినందన్ గ్రాండ్ హోటల్‌లో బీసీ చైతన్య సదస్సు కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బీసీలంతా ఐక్యంగా ఉంటేనే హక్కులను సాధించుకోవచ్చని అన్నారు. ఇప్పటికైనా ఒకే తాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. బీసీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చెన్న రాములుముదిరాజ్, సోషల్ డెమొక్రటిక్ జేఏసీ జాతీయ చైర్మన్ కోల జనార్దన్‌లు మాట్లాడుతూ ఈనెల 22న వనపర్తి జిల్లా కొత్తకోటలో బీసీ చైతన్య సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సులో విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ చిరంజీవులు, మాజీ ఎంపీ వి.హనుమంతరావులు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని తెలిపారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కొత్తకోటలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చైతన్య సదస్సు, సాంస్కృతిక కళాకారుల కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో సోషల్ డెమొక్రటిక్ మహిళా జేఏసీ జాతీయ చైర్‌పర్సన్ స్వరూప, బీసీ జేఏసీ నాయకులు సూర్యనారాయణ, బీసీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రామన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చండి

అంబర్‌పేట, మే 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి నేతలు కోరారు. శుక్రవారం ప్రగతిభవన్‌లో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రూబీ స్టీవెన్‌సన్, ప్రధాన కార్యదర్శి పి.వెంకన్న మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇస్తామని చెప్పిందన్నారు. ఇప్పుడు ఆ హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు, నెలకు 10 వేల రూపాయల పెన్షన్, హెల్త్ కార్డులు, ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించాలన్నారు. నిజమైన ఉద్యమకారులను గుర్తించడానికి ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర సాధన కోసం ఎంతో మంది తమ జీవితాలను త్యాగం చేశారన్నారు.

కళా సుబ్బారావు సేవలు చిరస్మరణీయం

చిక్కడపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): నటులు, గాయకులను నృత్యకళాకారులను ఇతర భిన్న కళా ప్రతిభావంతులను ప్రోత్సహించిన వ్యక్తి సాంస్కృతిక రంగసేవాధ్యక్షుడు కళాసుబ్బారావు అని ఎమ్మెల్సీ ఎస్ మధుసూదనాచారి అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి గానసభ మాజీ అధ్యక్షుడు కళా సుబ్బారావు జయంతి వేడుకలు జరిగాయి. ఈసందర్భంగా కళాసుబ్బారావు స్మారక పురస్కారాన్ని రసమయి సంస్థ అధ్యక్షుడు, కవి ఎం కె రాముకు బహూకరించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ జంటనగరాల్లో ప్రసిద్ధి పొందిన గానసభ ప్రారంభకుడిగా, అధ్యక్షుడిగా సుబ్బారావు సుదీర్ఘకాలం పనిచేశారన్నారు. ఎందరో కళాకారులకు వేదిక కల్పించారన్నారు. పురస్కారగ్రహీత రాము రసమయి సంస్థ ద్వారా ఎన్నో మంచి కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలిచారన్నారు. శ్రీ వేంకటేశ్వర యూనివర్శిటీ మాజీ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ సుబ్బారావు కళాపోషకుడు, సౌజన్యశీలి అన్నారు.

13న నృత్యరూపక ప్రదర్శన

చిక్కడపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో ఈనెల 13న అన్నమాచార్య 617వ జయంతి నిర్వహిస్తున్నారు. త్యాగరాయగానసభలో జరిగే కార్యక్రమ పోస్టర్‌ను శుక్రవారం చిక్కడపల్లిలోని సంస్థ కార్యాలయంలో ఆవిష్కరించారు. సంస్థ అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్ మాట్లాడుతూ నృత్య గురువు సీతాప్రసాద్ లక్ష్మి, బృందం(కొత్తగూడెం)ఆధ్వర్యంలో అన్నమయ్య కథ సంగీత నృత్యరూపక ప్రదర్శన ఉంటుందన్నారు. సంగీత విద్వాంసులు లోకనాథ శర్మకు అన్నమాచార్య సంకీర్తనా గాన నిపుణ బిరుదు ప్రదానం ఉంటుందని తెలిపారు.

వాకింగ్‌కు వెళ్లిన వృద్ధుడి అదృశ్యం

చిక్కడపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): వాకింగ్‌కు వెళ్లిన వృద్ధుడు అదృశ్యమైన సంఘటన చిక్కడపల్లి పీఎస్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ బి రాజునాయక్ తెలిపిన వివరాల ప్రకారం... బాగ్‌లింగంపల్లి నెహ్రూనగర్‌లో తన కుమారుడు నాగరాజు వద్ద వరమాల రాములు(64) ఉంటున్నాడు. నిత్యం ఆయన వాకింగ్ చేసి వస్తుంటారు. గత నెల 23న కూడా వెళ్లి తిరిగి రాలేదు. ఆయన కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం చిక్కడపల్లి పీఎస్‌లో కుమారుడు నాగరాజు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కార్పొరేటర్ పాదయాత్ర

అంబర్‌పేట, మే 9 (ఆంధ్రజ్యోతి) : అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ శుక్రవారం డివిజన్‌లోని ఆజాద్‌నగర్‌లో పాదయాత్ర నిర్వహించి బస్తీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్తీలో లోప్రెషర్ నీటి సమస్యను త్వరలో పరిష్కరిస్తామన్నారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు సన్నద్ధం

● 12 నుంచి 20 వరకు శ్రీవారి ఆలయ వేడుకలు



కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి



ఆలయ ముఖద్వారం

చిక్కడపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రసిద్ధిగాంచిన చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈనెల 12 నుంచి 20 వరకు స్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. ప్రతీ వైశాఖ మాసంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు 9 రోజులు అత్యంత వైభవంగా జరుగుతాయి. 16న కల్యాణ మహోత్సవం, 17న గరుడ వాహనసేవ, 18న రథోత్సవం, 20న ఉదయం 81 కలశాలతో ఘటాభిషేకం, రాత్రి 7 గంటలకు స్వామి వారి డోలోత్సవం జరుగుతుందని ఆలయ వ్యవస్థాపక వంశీయులు జి. రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్, ఈవో అన్నపూర్ణ తెలిపారు.



సివిల్స్ అభ్యర్థులకు సూచనలిస్తున్న సివిల్స్ ర్యాంకర్ చేతనరెడ్డి

స్వీయ క్రమశిక్షణే ముఖ్యం

● సివిల్స్ ఆశావహులకు ర్యాంకర్ చేతనరెడ్డి సూచనలు

చిక్కడపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): సివిల్స్ ప్రయత్నంలో అభ్యర్థులకు స్థిరత్వం, స్వీయక్రమశిక్షణ చాలా ముఖ్యమని ఆలిండియా సివిల్స్ 110 ర్యాంకర్ యన్. చేతనరెడ్డి సూచించారు. ఈ సందర్భంగా సివిల్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న ఆశావహులకు పలు సూచనలు చేశారు. శుక్రవారం ఉదయం ఆర్టీసీక్రాస్ రోడ్‌లోని విజన్ ఐఏఎస్ కోచింగ్ సెంటర్‌లో జరిగిన ఇంటరాక్షన్‌లో సివిల్స్ అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. అంకితభావం, వ్యూహాత్మక సంసిద్ధత, ప్రజాసేవ పట్ల లోతైన నిబద్ధత సివిల్స్ ఆశావహులకు అవసరమన్నారు. ప్రణాళికాబద్ధంగా చదవాలన్నారు. స్కిల్స్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ఈ పరీక్షలను ఎదుర్కొనేందుకు ప్రభావవంతమైన సంసిద్ధత, వ్యూహాలు, సమాధానాలు రాసే పద్ధతులు, మానసిక ఆరోగ్యం, పరిజ్ఞానం వంటి అంశాలు వివరించారు. జీఎస్ ఫౌండేషన్ కోర్సు తదితర అంశాలలో చేరిన విద్యార్థులకు మార్గదర్శకమైన సూచనలు ఇచ్చారు. అనంతరం అభ్యర్థులు లేవనెత్తిన పలు అనుమానాలను నివృత్తి చేశారు.

బాధితులకు నష్టపరిహారం వెంటనే చెల్లించాలి

● జై భీమ్ సేన ఫైట్ ఫర్ రైట్స్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బల్వంత్‌రావు

నల్లకుంట, మే 9 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ అత్యాచార బాధితులకు 2021 నుంచి 2025 వరకు చెల్లించాల్సిన కోట్ల రూపాయల నష్టపరిహారం నిధులు వెంటనే విడుదల చేయాలని జై భీమ్ సేన ఫైట్ ఫర్ రైట్స్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.బల్వంత్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను వారి సంక్షేమం కోసం కాకుండా ఇతర శాఖలకు ప్రభుత్వం దారి మళ్లిస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలీస్ స్టేషన్లలో ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు కావడం లేదన్నారు. ఈ విషయంపై బాధితులు ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తే తప్ప పీఎస్‌లలో కేసులు నమోదు కావడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వేల మంది బాధితులకు నష్టపరిహారం చెల్లించకపోవడం శోచనీయమన్నారు. పెండింగ్‌లో ఉన్న మొదటి, రెండో, మూడో దశ నష్టపరిహారాన్ని చేయాలని డిమాండ్ చేశారు.